క్లుప్తంగా

వైకుంఠపురంలో తొలి ఏకాదశికి ఏర్పాట్లు



అమరావతి: మండలంలోని వైకుంఠపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 17న తొలి ఏకాదశి పండగను ఘనంగా నిర్వహించటానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ అమరావతి, తుళ్ళూరు, తాడికొండ మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తారన్నారు. కొండ మీదకు వెళ్లే భక్తులకు దారిలో మంచినీరు, ఉత్తరవాహినీ స్నాన ఘట్టంలో స్త్రీలకు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త వాసిరెడ్డి సుధా స్వరూప్, గ్రామస్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరికీ ఉచిత ప్రసాదాలతోపాటు మజ్జిగ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

17న అభిషేక సేవలు రద్దు

నకరికల్లు: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ నెల 17న ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా చేజర్ల గ్రామంలోని కపోతేశ్వరస్వామి ఆలయంలో అభిషేక సేవలు రద్దు చేసినట్లు ఆలయ ఈవో వై.వెంకయ్య ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ నెల 17వ తేదీన తొలి ఏకాదశి, అలాగే మొహర్రం సందర్భంగా సెలవు కావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని అన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా వచ్చిన భక్తులందరూ స్వామి వారిని దర్శించుకునేందుకు వీలు కల్పిస్తూ అభిషేక సేవలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు సహకరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



అమరావతి: మండల పరిధిలోని మండెపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం గుంటూరుకు చెందిన ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ హృద్రోగ నిపుణురాలు, ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నూతక్కి విజయలక్ష్మితో పాటు వివిధ విభాగాల వైద్య నిపుణులు సుమారు 200 మందికి పైగా రోగులను పరీక్షించారు. అలాగే హృద్రోగులకు పీఎఫ్‌టీ, ఈసీజీ వంటి పరీక్షలతో పాటు పలు పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రూ.20 వేల విలువైన మందులను రోగులకు ఉచితంగా పంపిణీ చేశారు.

కుట్టు మిషన్లు పంపిణీ



సత్తెనపల్లి.: రెప్కో బ్యాంకు గుంటూరు శాఖ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం వావిలాల్ నగర్‌లోని నిరుపేదలైన 32 మంది కాందిశీకుల కుటుంబాలకు ఆదివారం కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. రెప్కో బ్యాంకు చైర్మన్ ఇ.సంతానం, రెప్కో ఫైనాన్స్ డైరెక్టర్ సి.తంగరాజు, అసోసియేషన్ ప్రతినిధులు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాందిశీకుల కుటుంబానికి ఏ అవసరం ఉన్నా తమ బ్యాంకు తరపున అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వావిలాల్ నగర్‌కు చెందిన రెప్కో బ్యాంకు ట్రస్టీ ఎ.మహేశ్వరి, డెలిగేట్‌లు ఆర్.మురళీధాసన్, ఎస్.అదృష్ట లక్ష్మి, ఆర్.నటరాజ్, ఆందోని స్వామి, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన అడ్వకేట్ కె. కుమారస్వామిని పట్టణ వ్యాపారులు ఘనంగా సన్మానించారు. కుమారస్వామి కార్యాలయానికి వారు వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. శాలువాలతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో వ్యాపారులు ఎస్. లక్ష్మయ్య చౌదరి, నారాయణ, మల్లేశ్వరరావు, షేక్ జైలాబ్దిన్, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

గోరింటా పూసింది..

- శూన్య మాసం.. పండగలకు నెలవు
- పుట్టింటికి చేరుకున్న కొత్త కోడళ్లు
- శుభకార్యాలకు మాత్రమే బ్రేక్
- ప్రారంభమైన ఆషాఢ మాసం



అరచేతుల్లో అందంగా గోరింటాకు

సత్తెనపల్లి: తెలుగు మాసాల్లో నాల్గవదైన ఆషాఢ మాసం ఈ నెల 6న ప్రారంభమైంది. ఎలాంటి శుభకార్యాలు తలపెట్టకున్నా.. ఈ మాసానికి అనేక విశిష్టతలు ఉన్నాయి. కొత్తగా పెళ్లయిన వధువులు పుట్టింటికి చేరుకుంటారు. కొత్త అల్లుళ్లను అత్త వారింట అడుగు పెట్టనివ్వరు. పూర్వాషాఢ నక్షత్రంతో కూడిన పౌర్ణమి ఉన్న నెలయే ఆషాఢ మాసం. పౌర్ణమి రోజున చంద్రుడు ఉత్తరాషాఢ/ పూర్వాషాఢ నక్షత్రాల మధ్యలో ఉండటం వల్ల వచ్చే నెలనే ఆషాఢ మాసంగా పిలుస్తారు. ఉత్తరాయణ పుణ్యకాలం పూర్తయి సూర్యుడు మిథున రాశి నుంచి కర్కాటక రాశిలోకి ప్రవేశించడంతో దక్షిణాయనం మొదలవుతుంది. దక్షిణాయనం ప్రారంభమైన మాసం కనుక ఆషాఢం శూన్యమాసం. శూన్య మాసంగా వ్యవహరించినప్పటికీ ఈ మాసంలో వచ్చే తొలి ఏకాదశితోనే పండగలు ప్రారంభమవుతాయి. ఈ నెల (జూలై)6న ప్రారంభమైన ఆషాఢం వచ్చే నెల (ఆగస్ట్) 5తో ముగుస్తుంది.

చాతుర్మాస్య వ్రతం ప్రారంభం

ఆషాఢంలో వర్షాలు కురుస్తాయని, వ్యాధులు ప్రబలుతాయనే ఉద్దేశంతో ఎలాంటి శుభకార్యాలు తలపెట్టరు. ఈ మాసంలో వివాహాలు, నిశ్చితార్థాలు, గృహ ప్రవేశాలు వంటి వేడుకలు నిర్వహించరు. భక్తులు ఈ నెలలోని తొలి ఏకాదశి నుంచే చాతుర్మాస్య వ్రతం ఆచరిస్తారు. పూరి జగన్నాథ రథయాత్ర, కుసుమహార జయంతి, సంకటహర చతుర్థి వంటి పర్వదినాలను ఈ నెలలోనే జరుపుకుంటారు. శుభకార్యాలు నిర్వహించనప్పటికీ ఈ నెలలో దేవతారాధనలు, శక్తి ఆరాధనలు చేస్తారు.

గోరింట మెరుపులు...

ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు ధరించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రీష్మ రుతువు చివర వర్ష రుతువు ప్రారంభానికి మధ్యలో ఆషాడం వస్తుంది. ఈ సమయంలో మన శరీరం వేడితో కూడుకుని ఉంటుంది. ఆషాడంలో బయటి వాతావరణం చల్లబడుతుంది. ఈ కారణంగా గోరింటాకును అరచేతుల్లో ధరిస్తే శరీరంలోని వేడి బయట చల్లబడిన వాతావరణానికి విరుద్ధంగా తయారవుతుంది. చర్మ సమస్యలు కూడా దరి చేరవు. గోరింటాకు శరీరంలో ఉండే వేడిని తగ్గించే శక్తిని కలిగి ఉండటంతో పాటు రోగనిరోధక శక్తిని సైతం పెంచుతుంది. అలాగే గోరింటాకు అతివల చేతులకు అందాన్ని ఇవ్వడంతో పాటు అనేక వ్యాధుల నుంచి రక్షణనిస్తుంది.

అత్తారింటి నుంచి పుట్టింటికి..

కొత్తగా పెళ్లయిన వధువులు ఆషాఢంలో అత్తారింటి నుంచి పుట్టింటికి వెళతారు. ఆషాఢంలో అత్తా కోడళ్లు ఒకరినొకరు చూసుకోకూడదని సంప్రదాయబద్ధంగా వస్తోంది. కొత్తగా పెళ్లై అత్తారింట్లో అడుగిడిన అమ్మాయిలు తల్లిదండ్రులపై బెంగతో ఉంటారు. వీరు ఆషాడంలో పుట్టింటికి వెళ్లి తోబుట్టువులు, స్నేహితురాళ్లతో కలిసి వేడుకలు జరుపుకుంటారని ప్రతీతి.



పెట్టుకునేందుకు సిద్ధంగా ఉన్న గోరింటాకు

పండగలు ప్రారంభం

ఆషాఢం అనే పదం 'ఆది' అనే సంస్కృత పదం నుంచి పుట్టింది. ఆది అనగా శక్తి అనే అర్థాన్ని ఇస్తుంది. కావున ఆషాఢంలో దేవతలను పూజించడం పవిత్ర కార్యమని భక్తుల నమ్మిక. ప్రముఖ పూరీ జగన్నాథుని రథయాత్ర సైతం ఆషాఢంలోనే జరపడం విశేషం. అందుకే ఈ నెలలో ఆలయాలు భక్తులతో రద్దీగా ఉంటాయి. ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున మహా విష్ణువు పాల కడలిపై యోగనిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా వ్యవహరిస్తారు. ఈ తొలి ఏకాదశి నుంచి పండగలు మొదలవుతాయి. ఆషాఢ శుద్ధ పౌర్ణమిని గురు పౌర్ణమిగా పరిగణిస్తారు.

గోరింటాకుతో చర్మ సౌందర్యం



మహిళలందరూ కలిసి ఆషాఢంలో గోరింటాకు పెట్టుకుంటాం. దీని వల్ల చర్మ సౌందర్యంతో పాటు అనేక ప్రయోజనాలు ఉంటాయి. పూర్వీకుల నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. గోరింటాకు పెట్టుకోవడం అంటే మహిళలకు ఎంతో ఇష్టం.

–పుసులూరి వెంకట లక్ష్మి, గృహిణి, సత్తెనపల్లి

పర్వదినాలు ప్రారంభం



ఆషాఢ మాసం వచ్చిందంటే పర్వదినాలు ప్రారంభమవుతాయి. ఆధ్యాత్మికతకు ఈ మాసం నెలవు. ఎక్కడ చూసినా ఆధ్యాత్మికత సంతరించుకుంటుంది. ఈ మాసంలోనే అనేక పర్వదినాలు ప్రారంభమవుతాయి. తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా జరుపుకుంటాం.

–ఉల్లంఘుల విజయలక్ష్మి, గృహిణి, సత్తెనపల్లి

అర్ధ చాతుర్మాస్య దీక్ష ప్రారంభోత్సవానికి విచ్చేయండి

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీవాసవి నిత్యాన్నసత్ర వానప్రస్థాశ్రమ సేవా సంఘ భవనంలో ఈ నెల 17వ తేదిన అర్ధచాతుర్మాస దీక్ష ప్రారంభోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వాసవి నిత్యాన్నసత్ర వానప్రస్థాశ్రమ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్ఎస్ఆర్ ఆంజనేయులు తెలిపారు. ఆదివారం అయన కార్యక్రమ వివరాలు తెలియచేస్తూ తెనాలికి చెందిన పూజ్య శ్రీ ప్రజ్ఞానంద సరస్వతీ స్వామీజీ చే ఈ నెల 17వ తేది నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు అర్ధచాతుర్మాస్య దీక్ష కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఈ రెండు నెలల్లో వచ్చే వివిధ పండగలు, పర్వదినాలను స్వామి వారి చేతుల మీదుగా శాస్త్రోక్తంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని పూజ్య శ్రీ ప్రజ్ఞానంద సరస్వతీ స్వామీజీ ప్రవచనాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మాజేటి గోపాలకృష్ణ, పులిపాటి వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌జేసీ సత్తెనపల్లి బ్రాంచ్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



సత్కారం అందుకున్న నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

సత్తెనపల్లి/పెదకూరపాడు: ఎన్ఎస్‌జేసీ సత్తెనపల్లి బ్రాంచ్ అధ్యక్షుడిగా జె.నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాగార్జునసాగర్ జవహర్ కెనాల్స్ (ఎన్ఎస్‌జేసీ) లింగంగుంట్ల సర్కిల్ సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, నకరికల్లు, అమరావతి బ్రాంచ్ ఏపీ వర్క్- చార్జ్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం పట్టణంలో జరిగాయి. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.మరియదాసు, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా కె.కోటేశ్వరరావు, అబ్జర్వర్‌గా స్టేట్ ప్రెసిడెంట్ సీహెచ్ పోతురాజు వ్యవహరించారు. సత్తెనపల్లి బ్రాంచ్ అధ్యక్షుడిగా జె.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా టి.శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కుమ్మటి అబ్రహం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.సుధాకరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ ప్రకాష్‌బాబు, సెక్రటరీగా వి.మల్లికార్జునరావు, జాయింట్ సెక్రటరీగా కె.సురేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.ఆంజనేయులు, ట్రెజరర్‌గా ఎం.బ్రహ్మానందరావుతో పాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నకరికల్లు బ్రాంచ్ అధ్యక్షుడిగా సూరెబోయిన శంకరరావు, ప్రధాన కార్యదర్శిగా ఉడుముల శ్రీనివాసరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చట్టు శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా ఎ.హనుమంతరావుతో పాటు మరో 22 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అమరావతి బ్రాంచ్ అధ్యక్షుడిగా ఎం.మరియదాసు, ప్రధాన కార్యదర్శిగా బంకా రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బిల్లా మేరీలు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా టి.వీరబాబు, సెక్రటరీగా పేరేచర్ల సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.రామాంజనేయులు, ట్రెజరర్‌గా షేక్ ఆదం సాహెబ్‌తో పాటు మరో 18 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సత్తెనపల్లి, నకరికల్లు, అమరావతి బ్రాంచ్‌ల నూతన కార్యవర్గాన్ని సభ్యులు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నాగార్జున సాగర్ జవహర్ కెనాల్ లింగంగుంట్ల సర్కిల్ సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని వర్క్ అండ్ చార్జ్డ్ ఎంప్లాయిస్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడతామన్నారు. నూతన కార్యవర్గాన్ని సంఘ నాయకులు అభినందించారు.

విత్తన బంతులు చల్లిన పల్లె సృజన బృందం



కారెంపూడి: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పల్లె సృజన పత్రిక పాత్రికేయులు, ప్రకృతి ప్రేమికులు పలువురు ఆదివారం నల్లమల అటవీ ప్రాంతంలో విత్తన బంతులు చల్లారు. పర్యావరణ పరిరక్షణకు అడవుల వృద్ధికి కారెంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) చేస్తున్న కృషిని గుర్తించి ఆయనకు సంఘీభావం తెలిపేందుకు వీరంతా తరలివచ్చారు. వారు కారెంపూడి వచ్చి పల్నాటి రణక్షేత్రంలోని పల్నాటి వీర్ల అంకాలమ్మ, చెన్నకేశవస్వామి, వీరుల గుడిని సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నల్లమల అడవికి వెళ్లి విత్తన బంతులు చల్లారు. వ్యయప్రయాసలకోర్చి వారు రావడంపై అంకారావు హర్షం వ్యక్తం చేశారు. ఎవరి ప్రాంతాలలో వారు ఈ బంతులు చల్లడం, మొక్కలు నాటడం వంటి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ



ప్రిన్సిపల్‌తో ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులు

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో స్కిల్ హబ్ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు పూర్తి చేసిన వారికి ధ్రువపత్రాలు అందించారు. 90 రోజుల శిక్షణ పూర్తి చేసుకోవటంతో ఆదివారం సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ పీవీ కృష్ణారెడ్డి హాజరయ్యారు. 19 మందికి పీఎంకేవీవై కిట్లతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు వీరు అర్హత పొందుతారని తెలిపారు. స్కిల్ హబ్ ఇన్‌ఛార్జి శ్రీకాంత్ మాట్లాడుతూ 4వ బ్యాచ్ విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. కొత్త బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయని చెప్పారు. కాలేజీ వైస్ ప్రెసిడెంట్ వెంకట నర్సయ్య, బాబురావు, మస్తాన్ పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్లు పంపిణీ

సత్తెనపల్లి: అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో దాత చావల వెంకటేశ్వర్లు సహకారంతో చావల జీవనపుష్ప, కుమ్మరి రెడ్డిమౌనిష పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని రైల్వేస్టేషన్, తాలూకా సెంటర్, బస్టాండ్ పరిసర ప్రాంతాలలోని అన్నార్తులకు ఆదివారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు మాట్లాడుతూ అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సేవా సంస్థ పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, పుస్తకాల పంపిణీ, పేద మహిళలకు నిత్యావసర సరుకులు అందించడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. సేవా దృక్పథం ఉన్న వారు ఎవరైనా తమ సంస్థలో వలంటీర్‌గా చేరవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ కుమ్మరి దస్తగిరి, సభ్యులు పిక్కిలి శివ, సిద్దెల వేణుబాబు, గొట్టం వెంకటేష్, టైలర్ సుభాని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



సత్తెనపల్లి: ఆర్టీసీ బస్, టాటా ఏస్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని శివాలయం తర్వాత మలుపులో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి-అచ్చంపేట రోడ్డు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో శివాలయం దాటిన తర్వాత మూల మలుపులో చెత్తను నిల్వ చేసే ఇనుప బాక్సులను పురపాలక సంఘం ఏర్పాటు చేయడంతో వాటిని తప్పించే క్రమంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి గాయాలు కాగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వైద్యశాలలకు తరలించారు. ఆ ప్రాంతంలో ప్రమాదాల నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. జనం గుమికూడటంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రాణాప్రాయం నుంచి బయట పడటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

జీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్



పిడుగురాళ్ల: ఎలాంటి విధివిధానాలు రూపొందించకుండా జీపీఎస్ అమలుకు ఇటీవల విడుదల చేసిన జీవోను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పిడుగురాళ్ల యూటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆదివారం మాట్లాడారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జె. విజయసారథి ఆధ్వర్యంలో జీవో ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నూతన ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఆనందం నింపాలంటే ఈ జీవో రద్దు చేయాలని తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కూడా వెంటనే పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. నూతన ప్రభుత్వం ఉద్యోగుల సానుకూల, న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాసీం పీరా, ఎం. సాంబశివరావు, జమాల్, విశ్వరూపాచారి, ప్రసాద్, షేక్ ఫిరోజ్ బాషా, పి. నాగేశ్వరరావు, ఎన్. హనుమంతరావు పాల్గొన్నారు.

కొంగు బంగారం... దేశమ్మ తల్లి



పూజలు అందుకుంటున్న దేశమ్మ తల్లి



బోనాల్లో పాల్గొన్న మహిళ భక్తులు

- 75త్యాళ్ళూరులో దేశమ్మ తల్లికి బోనాలు
- పొంగళ్లు పొంగించి, జల బిందెలతో వారుపోసిన భక్తులు
- అమ్మవారికి ఉమ్మడిపొంగళ్లు

పెదకూరపాడు: కొంగు బంగారు తల్లిగా కోరిన కోర్కెలు తీర్చే అమ్మ దేశమ్మ తల్లి ఆషాడ మాస ఉత్సవాలు మండలంలోని 75 త్యాళ్ళూరు గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక పొంగళ్లు పొంగించారు. అనంతరం జలబిందెలతో అమ్మవారికి వారు పోశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పెద్దలు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆషాడ మాసంలో వచ్చే రెండవ ఆదివారం అమ్మవారికి గ్రామంలోని అందరు వారు పోసి పొంగళ్లు నైవేద్యంగా (బోనాలు) సమర్పిస్తారన్నారు. గ్రామ పెద్దకాపు మొదటి పొంగళ్లను అమ్మవారికి అందించారు. గ్రామంలోని మహిళలు, పెద్దలు, చిన్నలు అమ్మవారికి జలబిందెలతో వారుపోశారు. మేళతాళలతో గ్రామంలో మహిళలు ప్రభను కట్టుకొని అమ్మవారికి పొంగళ్లు, పసుపు కుంకుమ సమర్పించారు. సాయంత్రం గ్రామంలో జాతర నిర్వహించి పోతులను సమర్పించి సామూహికంగా అన్న సంతర్పణ చేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



చెరుకుంపాలెంలో కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అచ్చంపేట: మహిళలు ఆర్థికంగా ఎదగాలని, అప్పుడే కుటుంబ ప్రగతి బాగుంటుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని చెరుకుంపాలెంలో శనివారం రాత్రి స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా శిక్షణ పొందుతున్న 6 గ్రామాలకు చెందిన 100 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు స్నేహహస్తాలు ఫౌండేషన్ కృషి అభినందనీయమన్నారు.

అచ్చంపేటలో బస్ షెల్టర్ ప్రారంభం

స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ ముందు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన బస్ షెల్టర్‌ను శనివారం రాత్రి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభించారు. ఈ బస్ షెల్టరు 28 గ్రామాల నుంచి వివిధ అవసరాల కోసం మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐదో ఆర్థిక సంఘాన్ని ప్రక్షాళన చేయాలి

అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అమరావతి: ఐదో ఆర్థిక సంఘాన్ని ప్రక్షాళన చేసి స్థానిక సంస్థలకు త్వరితగతిన నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. శనివారం అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు బృందం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి వినతిపత్రం అందజేసింది. ఆదివారం డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఐదో ఆర్థిక సంఘం పనితీరు అస్తవ్యస్తంగా ఉందని దీనిని ప్రక్షాళన చేసి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి సకాలంలో వచ్చేలా చూడాలని కోరామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులతో స్థానిక సంస్థల అభివృద్ధి ముడిపడి ఉందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శి గోళ్ల మాల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

16న కార్మెల్‌మాత మందిరం వార్షికోత్సవం



రెంటచింతలలోని కార్మెల్‌మాత మందిరం

రెంటచింతల: స్థానిక నాయుడుపేట ఎస్సీ కాలనీ వద్ద నిర్మించిన కార్మెల్‌మాత మందిరం 6వ వార్షికోత్సవాలు ఈ నెల 16వతేదీన నిర్వహించనున్నట్లు కానుకమాత చర్చి విచారణ గురువులు రె. ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి ఆదివారం తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా పవిత్ర సమష్టి దివ్యపూజాబలి సమర్పించనున్నట్లు చెప్పారు. గ్రామ మాజీ సర్పంచ్ గుర్రాల రాజు తన సొంత నిధులతో నిర్మించిన ఈ మందిరంలో కార్మెల్‌మాతతోపాటు పునీత జోజప్ప, ఏసుక్రీస్తు ప్రతిమలు ఏర్పాటు చేయడం విశేషం. సాయంత్రం 6 గంటలకు విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో సహాయక గురువులు అగస్టీన్, ఫాదర్ పాపయ్యతో కలిసి పవిత్ర సమష్టి దివ్యపూజాబలిని సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దమ్ము చక్రాలతో దెబ్బతింటున్న రోడ్లు





రెంటచింతల గ్రామంలో మాచర్ల- గుంటూరు ప్రధాన రహదారిపై దమ్ము చక్రాలతో వెళ్తున్న ట్రాక్టర్లు

రెంటచింతల: ప్రయాణికుల కోసం ప్రభుత్వం రూ.వందల కోట్లు వెచ్చించి తారు రోడ్లు వేసింది. వాటి భద్రత విషయంలో సంబంధిత స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పది కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన రోడ్లు దమ్ము చక్రాలతో ట్రాక్టర్‌లు వెళ్తున్న కారణంగా కొద్దికాలానికే అధ్వానంగా మారుతున్నాయి. వాస్తవానికి ఆ చక్రాలకు రబ్బరు తొడగాల్సి ఉంది. స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల తొడుగులు లేకుండా ట్రాక్టర్‌లను రోడ్లపైనే తిప్పుతున్నారు. వీటి తీరుతో వాహనదారులు, ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దమ్ము చక్రాల ట్రాక్టర్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.